క్లుప్తంగా

సకాలంలో పనులు పూర్తి చేయాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరగా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్‌తో కలిసి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం పలు సూచనలు చేశాడు. ఆయన వెంట ఎంపీడీఓ తారిక్‌అన్వర్, ఎంపీఈఓ మహబూబ్ అలీలు ఉన్నారు.

సమన్వయంతో ముందుకెళ్తాం

సిద్దిపేటకమాన్: అధికారమే లక్ష్యంగా అందరి సమన్వయంతో ముందుకు వెళ్తామని బీజేపీ నాయకుడు చక్రధర్‌గౌడ్ అన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన చక్రధర్‌గౌడ్ మొదటిసారిగా సిద్దిపేటకు రావడంతో గురువారం బీజేపీ కార్యకర్తలు అతడికి స్వాగతం పలికి పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం వడ్డెపల్లి దయానంద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో చక్రధర్‌గౌడ్ మాట్లాడుతూ.. తాను బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. తన చేరికకు సహకరించిన బండి సంజయ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి వేణు, జనార్దన్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంపై చర్య తీసుకోవాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఐకేపీలో జరుగుతున్న లావాదేవీలపై విచారణ చేపట్టి ఐకేపీ ఏపీఎంపై చర్య తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఐకేపీలో ఏపీఎం నిర్లక్ష్యంతోనే శ్రీనిధి రుణాలు రూ.35లక్షలు పెండింగ్‌లో పడ్డాయన్నారు. మహిళా సంఘాల సభ్యులు రుణం తీసుకున్నట్లు రికార్డులు తయారు చేసి శ్రీనిధి రుణాలను సిబ్బంది కాజేశారని ఆరోపించారు. సంవత్సరాలు గడుస్తున్నా వాటిని రికవరీ చేయకుండా కాలయాపన చేస్తూ అధికారులు లబ్ధిపొంది మహిళాసంఘాలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఐకేపీలో అవినీతికి పాల్పడుతున్న వారిపై ఉన్నత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోసుకొని వారిని సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శారద, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో నాలుగు రెవెన్యూ గ్రామాలు విలీనం

జీఓ జారీ చేసిన ప్రభుత్వం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో కొనసాగుతున్న రేగొండ, గౌరవెల్లి, కేశవాపూర్, జనగామ రెవెన్యూ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం జీఓ నంబర్ 59 ద్వారా విడుదల చేసింది. ఈ రెవెన్యూ గ్రామాల పరిధిలో రేగొండ, గోవర్ధనగిరి, మల్‌చెర్వుతండా, గౌరవెల్లి, బొడిగెపల్లి, జనగామ, కేశవాపూర్, మంచినీళ్లబండ, గుబ్బడి, గుడాటిపల్లి గ్రామాలు కలవనున్నడంతో గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కన్నపేట మండలానికి దూరంగా రవాణా సౌకర్యాలు సరిగా లేని కారణంగా గ్రామస్తులు, సీనియర్ నాయకులు పలుమార్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌లకు పలుమార్లు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హుస్నాబాద్‌లో విలీనం చేస్తూ జీవోను జారీ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం గ్రామాలను విలీనం చేయడంపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బెజ్జంకిలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆలయ కమిటీ నూతన చైర్మన్ రాములు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బెజ్జంకిలో నిర్మిస్తున్న ఆరుంధతి కల్యాణ మండపం పనులను పరిశీలించారు. ఏప్రిల్ చివరి వరకు పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, ఎండోమెంట్ ఈఓ శర్మ, సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, ఎంపీటీసీ గుబిరె శారద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజయ్య, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- మద్దూరులో బీఆర్‌ఎస్ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని, మన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తాజ్‌గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో జనగామ జిల్లా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి కోటంరెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గతంలో తాగు, సాగు నీటి కష్టాలు ఉండేవని, స్వరాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మించుకొని తాగు, సాగు నీటికష్టాలు తీర్చుకున్నామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందని రాష్ట్రంపై కక్ష్యపూరిత ధోరని అవలంభించడం సరికాదన్నారు. త్వరలో రాష్ట్రంలో సార్వతిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. దేశ సంపదను కొల్లగొడుతున్న ఆదానీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా తెలంగాణ ఆడబిడ్డ కవితను ఈడీ పేరుతో ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, గందరగోళాలను నివారించేందుకు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీతో దేశ అభివృద్ధిలోకి అడుగుపెట్టేందుకు అందరం కృషి చేద్దామన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని కేజీబీవీల్లో పదో తరగతి విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుమలతమల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మమత, యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.25.46కోట్లతో దుబ్బాక మున్సిపాలిటీ బడ్జెట్

ఏకగ్రీవంగా ఆమోదించిన పాలకవర్గం



సమావేశంలో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.25.46కోట్లతో బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అధ్యక్షతన అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సమక్షంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్‌కు సంబంధించిన ఆదాయ, వ్యయాల కేటాయింపులు పద్దుల వారీగా గణాంక అధికారి వెంకట్రావు చదివి వినిపించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.25.46కోట్లతో బడ్జెట్‌ను ఆమోదించగా ఇందులో బడ్జెట్ వ్యయం రూ.25.42 కోట్లు పోగా రూ.4.16 లక్షలు మిగులు బడ్జెట్ ఉంది. మున్సిపాలిటీకి ఈ వార్షిక సంవత్సరానికి గాను పన్నుల ద్వారా ఆదాయం రూ.4.60 కోట్లు అంచనా ఉండగా అభివృద్ధి పనులు, ఇతర నిర్వహణ వ్యయం కోసం రూ.4.58 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో 10 శాతం రూ.46.24లక్షలు గ్రీనరీ కోసం కేటాయించడం విశేషం. ప్రజా సౌకర్యార్థం, వార్డుల అభివృద్ధి కోసం రూ.35.83 లక్షలు కేటాయించారు. ఇతర సాధారణ వ్యయానికి రూ.99.47లక్షల నిధులను కేటాయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పాలకవర్గం కలసికట్టుగా ఉండి అన్ని రంగాల్లో దుబ్బాకను ఆదర్శంగా అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ గణేశ్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సుగుణ, కౌన్సిలర్లు ఉన్నారు.



గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం


అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ సోమవారం అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఇంజినీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు ఇలా ఒక్కో రంగంలో స్థిరపడ్డ 100మందికిపైగా విద్యార్థులు ఒకచోట కలుసుకొని చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. చిన్ననాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అపూర్వ కలయికకు దోహదపడ్డ పూర్వ విద్యార్థులు కె.ఇంద్రాసేనారెడ్డి, జే.పాపరావు, ముత్యాల సంజీవ్‌రెడ్డి, కె.అశోక్‌రెడ్డిలతో పాటు తదితర కృషిని తోటి స్నేహితులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇర్రి లావణ్యరాజిరెడ్డి, పాఠశాలడ హెచ్‌ఎం రంగానాయక్, ఉన్నారు.

అంధత్వ నివారణకే కంటి వెలుగు

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ కోసం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలో సోమవారం 10వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు గోవిందు రవి, భాగ్యరెడ్డి, సానిటరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వైద్యాధికారుల పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: పట్టణంలోని 13వ వార్డులో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వసతులు, ఏర్పాట్లపై ఆరా తీశారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ విఠోభ, అధికారులు పాల్గొన్నారు.

స్టీల్ బ్యాంక్ సేవలను విస్తరిద్దాం



రుతుప్రేమ కప్స్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: స్టీల్ బ్యాంక్ సేవలను మరింతగా విస్తరిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ఆర్పీలకు మున్సిపల్ కమిషనర్ సంపత్‌తో కలిసి రుతుప్రేమ కప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి, మెప్మా సీఓ రమ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



బాలికలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం బాలికలకు న్యూట్రిషన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఈ ప్రాంతానికి, పాఠశాలకు పేరు తేవాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు.

వారం రోజుల్లో డిగ్రీ కళాశాలను షిఫ్ట్ చేస్తాం..

హుస్నాబాద్ పట్టణంలో రూ.2కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన డిగ్రీ కళాశాలను, రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఉమెన్స్ మేనేజ్‌మెంట్ హాస్టల్, రూ.1కోటి వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియంలను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సందర్శించారు. కొత్త బిల్డింగ్‌లోకి వారం రోజుల్లో డిగ్రీ కళాశాలను షిఫ్ట్ చేస్తామన్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, అన్ని మౌలిక వసతులతో ఈ భవనాలను త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఎంపీపీ లకావత్ మానస, కౌన్సిలర్లు సరోజన, హరీశ్, కస్తూర్బా గాంధీ పాఠశాల అధికారి మమత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణం



కల్యాణోత్సవంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారంలో బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒగ్గు డోలు వాయిద్యాల మధ్య జరిగిన కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. బీరప్ప కల్యాణ కథనంపై ఒగ్గు కళాకారులు ఆలపించిన ఒగ్గు గీతాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు సహకారంతో భక్తులకు బీజేపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కొల్గూరు గ్రామంలో ఈనెల 17 నుంచి 25 వరకు జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప కామరాతి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ అమరావతితో పాటు సర్పంచ్ రాజు, ఎంపీటీసీ జ్యోతిస్వామిలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రభుత్వ భూమిని కాపాడాలి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ భూమిలో కబ్జాకు గురైన భూమి స్వాధీనం చేసుకొని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరుతూ సోమవారం సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. మండల పరిధిలోని విశ్వనాథపల్లి, రవీంద్రనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 271/10లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని ప్లాటింగ్ చేసి విక్రయిస్తున్నారన్నారు. కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని పేదలు సొంతింటి కలను సాకారం చేసుకునేలా ఇంటి స్థలాలకు కేటాయించాలన్నారు.

◆ బాధిత కుటుంబానికి సాయం

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన అమృతోజి శ్రీనివాసచారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఎంపీటీసీ రాంరెడ్డి రూ.10వేలు ఇద్దరు పిల్లల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. డిపాజిట్ చేసిన బాండ్లనుకుటుంబ సభ్యులకు అందజేశాడు.

◆ సమస్యలను పరిష్కరించడంలో విఫలం

మిరుదొడ్డి(దుబ్బాక): ఐకేపీ వీవోఏల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వీఓఏల జిల్లా నాయకురాలు జమున విమర్శించారు. వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మిరుదొడ్డి మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం కృష్ణారెడ్డికి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏలు వెంకటలక్ష్మి, నసీరుద్దీన్, లావణ్య, లక్ష్మి, శ్యామల, పద్మ పాల్గొన్నారు.

◆ రెండోరోజు కొనసాగిన న్యాయవాదుల నిరసన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో సబ్‌కోర్టు ఏర్పాటు కోసం న్యాయవాదులు చేస్తున్న నిరసన కార్యక్రమం రెండోరోజు సోమవారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గజ్వేల్ బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎంపీపీ సుగుణ అన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో దొమ్మాట బాబుకు రూ.49500లు, తలపాక మల్లేశంకు రూ.45000లు, దేవర దివ్యకు రూ.25000లు, దూలం నర్సింలుకు రూ.14వేల చెక్కులను సోమవారం అందజేశారు.

గజ్వేల్‌రూరల్: మండలంలోని కొల్గూరు గ్రామానికి చెందిన కిష్టయ్యకు మంజూరైన రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీటీసీ జ్యోతిస్వామి సోమవారం లబ్ధిదారుడికి అందజేశారు.

◆ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

దుబ్బాక: ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలో న్యూట్రీషన్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్, కోఆప్షన్ మెంబర్ ఆసిఫ్, కౌన్సిలర్ పులిగారి కల్పన, ఎల్లం, ఖాజా, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

◆ మహిళల అభ్యున్నతికి కృషి

నంగునూరు(సిద్దిపేట): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. నంగునూరు మండలంలోని 850 గ్రూపులకు ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ డబ్బుల పత్రాలను సోమవారం మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు, ఐకేపీ అధికారులతో కలసి మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్, ఏపీఎం ఆంజనేయులు, లింగం, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, సాయిలు, ముజామ్మిల్, భవాని, పద్మ పాల్గొన్నారు.

◆ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్ మెట్టయ్య, ఎంపీపీ అమరావతి, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు తలకొక్కుల దుర్గాప్రసాద్, తుమ్మ నర్సింలు, ఎల్లేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు



మహ్మదాపూర్‌లో మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆదివారం, సోమవారం రెండురోజులు 1000 మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూనే తరుగుతున్న అడవికి జీవం పోశారు. గ్రామానికి సమీపంలో అటవీ ప్రాంతం ఉండడం, ఎక్కువ గుట్టలు ఉండడంతో ఈ ప్రాంత ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గతంలో హరితహారంలో మొక్కలు నాటించారు. 1500 మొక్కల వరకు ఇటీవల కొందరు తొలగించి ప్రభుత్వ భూమిని చదును చేశారు. మొక్కల తొలగింపుపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి గుంతలు తీసి మొక్కలు నాటారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు గ్రామస్తులందరూ కలిసి రావడంతో సర్పంచ్ పిట్టల సంపత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇక నుంచి ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గానికి గ్రామస్తులు సూచించారు.

హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ఎన్నో సంవత్సరాలుగా హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. సోమవారం హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్వో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం రాష్ట్ర కోశాధికారి మామిడాల కనకయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మల్లారెడ్డి, పరశురాములు, సభ్యులు మచ్చేందర్, భూపతిరెడ్డి, కనకయ్య, సత్తయ్య, బీరయ్య ,మల్లేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నంగునూరులో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బాల్‌రాజు, యాదయ్య, శ్రీనివాస్, రాజు, చంద్రం, సత్యం, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

చేర్యాల(సిద్దిపేట): హమాలీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్న హమాలీలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి డిమాండ్ చేశారు. సోమవారం హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎస్.కే.అరిఫాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల, పట్టణ కన్వీనర్లు కుమార్, భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం అందేలా చూస్తాం



కిష్టాపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొండపాక(గజ్వేల్): అకాల వర్షాలకు నష్టపోయిన పంటకు పరిహారం అందేలా చూస్తామని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణి అన్నారు. మండల పరిధిలోని గిరాయిపల్లి గ్రామంలో పంటలను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసపురం సంజీవరెడ్డి, ఏఈఓ విష్ణు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కిష్టాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు మొక్కజొన్న పంటలను పరిశీలించారు. సుమారు 10 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. పంట నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

తైబజారు వేలం ఆదాయం రూ.4.33లక్షలు



వేలంలో పాటదారులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో జరిగే వారసంత సందర్భంగా తైబజార్ వసూలు చేసేందుకు గాను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి ఆధ్వర్యంలో కమిషనర్ రాజేంద్రకుమార్ సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో పట్టణ కేంద్రానికి చెందిన శ్రీనివాస్, కిష్టయ్య, పోచయ్యలు పాల్గొనగా వెలుగల శ్రీనివాస్ రూ.4,33,000లు పాట పాడి దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, లీల, కో–ఆప్షన్ సభ్యులు అంజనీదేవి, ఆరోగ్యరెడ్డి, నాయకులు ఇక్బాల్, సంజీవులు, శ్రీధర్, మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి




మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి నిందితులు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట పట్టణంలో సోమవారం బీజేఆర్ చౌరస్తా వద్ద ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్ తరలించారు. కార్యక్రమంలో నాయకులు మాజర్ మాలిక్, కలీముద్దిన్, శంకర్, భిక్షపతి, బర్మా రామచంద్రం, రాజ్వీర్, గయాజుద్దీన్, రశద్, మల్లేశం, అజ్జుయాదవ్, నరసారెడ్డి, మున్నా పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): ప్రశ్నాపత్రాలు లీక్ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీ దహనం చేశారు. అనంతరం టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ.. లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ పీఏ హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో యాదగిరి, నాగరాజు, కనకయ్య, సంపత్, కృష్ణ, శ్రీనివాస్, శివప్రసాద్, ప్రసాద్‌గౌడ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



సిద్దిపేటలో..



హుస్నాబాద్: దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీకి సంబంధించిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన ప్రతి విద్యార్థికి రూ.1లక్ష నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటన పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ హౌజ్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, నాయకులు తదితరులు ఉన్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్‌లో బీజేవైఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్‌పై అక్రమ కేసు ఎత్తివేయాలని, గ్రూప్–1 అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల బీజేవైఎం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌యాదవ్, పాండు, శ్రీనివాస్‌గుప్తా, నరేందర్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్, బన్నీరెడ్డి పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద పేపర్ లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 'మా నౌకర్లు మాకు కావాలె' అంటూ ప్లకార్డులను చేతబట్టి బీజేపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జి ద్వారా సమగ్రమైన విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ముస్తాబాద్ చౌరస్తాలో పార్టీ పిలుపు మేరకు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రామచంద్రరావు, వెంకటేశ్, మార్కండేయ పాల్గొన్నారు.